# రెవెన్యూశాఖలో పదోన్నతులు

### 838 మందికి డీపీసీ ఆమోదం

### సీసీఎల్ఏ, ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్‌కి ట్రెసా కృతజ్ఞతలు




నవీన్ మిట్టల్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ట్రెసా ప్రతినిధులు

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : రెవెన్యూశాఖలోని సీనియర్ అసిస్టెంట్లకు నాయబ్ తహసీల్దార్లుగా పదోన్నతి కల్పించనున్నారు. ఈ మేరకు రెవెన్యూశాఖలోని డిపార్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా సీఎం, రెవెన్యూశాఖ మంత్రి కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా భూ పరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్‌ను ట్రెసా బృందం శనివారం కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూశాఖలోని జూనియర్ అసిస్టెంట్ నుంచి సీనియర్ అసిస్టెంట్ల వరకు, ఆఫీస్ సబార్డినేట్ నుంచి జూనియర్ అసిస్టెంట్ ప్రామోషన్లు కలిపించాలని కోరగా వెంటనే ప్రామోషన్స్ ప్రాసెస్ కొరకు సంబంధిత అధికారులను ప్రభుత్వం ఆదేశించిందని గుర్తుచేశారు. అదేవిధంగా కంప్యూటర్ ఆపరేటర్లు, హ్యాండ్ హోల్డింగ్ పర్సన్ల వేతన బిల్లులు, రెన్యూవల్ గురించి చర్చించగా సానుకూలంగా స్పందించిందని తెలిపారు. పదోన్నతి పొందిన డీటీలకు ప్రస్తుతం పనిచేస్తున్న జిల్లాల్లోనే పనిచేసే అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రెసా అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతమ్ కుమార్, ఉపాధ్యక్షులు రమేశ్ పాక, కోశాధికారి వెంకటేశ్వర్‌రావు, జాయింట్ సెక్రటరీ నజీమ్‌ఖాన్, వాణి రెడ్డి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, నిజామాబాదు జిల్లా అధ్యక్షులు రమన్‌రెడ్డి, జగిత్యాల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ వకీల్ తదితరులు పాల్గొన్నారు.

# పరిస్థితులకు అనుగుణంగా మీడియా ప్రతినిధులు మారాలి

- మీడియాలో మారుతున్న పరిస్థితులను అలవర్చుకోవాలి
- ఓయూలో ప్రొఫెసర్ల పదవీ విరమణ సభలో తెలంగాణ టుడే ఎడిటర్ శ్రీనివాస్‌రెడ్డి



కార్యక్రమంలో తెలంగాణ టుడే ఎడిటర్ శ్రీనివాస్‌రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 30 : మీడియాలో కొనసాగుతున్న వ్యక్తులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమను తాము మార్చుకోవాలని, అప్పుడే వారు విజయవంతం అవుతారని తెలంగాణ టుడే ఎడిటర్ శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఒకప్పుడు రేడియోతో మొదలైన మీడియా ప్రస్థానం గురించి వివరించారు. ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిజం విభాగంలో సీనియర్ ప్రొఫెసర్లు కె.స్టీవెన్‌సన్, కె.నరేందర్ పదవీ విరమణ సభను ఆర్ట్స్ కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్‌రెడ్డి విభాగం తరఫున ముద్రిస్తున్న ఈ-జర్నల్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన 'ట్రాన్సిషన్ ఆఫ్ మీడియా పోస్ట్ – ఇండిపెండెన్స్' అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేడియో, వార్తాపత్రిక, టీవీ జర్నలిజం, లైవ్ కవరేజీలుగా మీడియా వేగంగా వ్యాప్తి చెందిందని అన్నారు. సోషల్ మీడియా ప్రవేశంతో మొత్తం పరిస్థితి మారిపోయిందని చెప్పారు. పాతకాలంలో జర్నలిజంలో చేరిన వారు డిజిటల్ మీడియాకు మారడం చాలా కష్టమని అభిప్రాయపడ్డారు. మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ మాట్లాడుతూ సాంకేతికతతో మీడియా రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయని చెప్పారు. ఆ మార్పులకు అనుగుణంగా మారకపోతే వెనకబడిపోయే ప్రమాదముంటుందని అన్నారు. త్వరలో ఇంకా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. మంచి కంటెంట్ ఉంటే విజయం పొందవచ్చని చెప్పారు. సాధారణ వ్యక్తులు కూడా డిజిటల్ మీడియా, సోషల్ మీడియాలో విజయం పొందుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే గాదరి కిశోర్ మాట్లాడుతూ ప్రొఫెసర్ స్టీవెన్‌సన్, ప్రొఫెసర్ నరేందర్ తనకు గురువులని అన్నారు. తన విజయంలో గురువుల పాత్ర ఎంతో ఉన్నదని చెప్పుకొచ్చారు. అనంతరం ప్రొఫెసర్ స్టీవెన్‌సన్‌ను పరిశోధక విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్యాంసుందర్, డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, డాక్టర్ సతీశ్‌కుమార్, ఓయూ పీఆర్‌వో ప్రొఫెసర్ ప్యాట్రిక్, ఈఎంఆర్‌సీ డైరెక్టర్ రఘుపతిరెడ్డి, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

### రాష్ట్రంలో తొలిసారిగా..

**ఓయూ వేదికగా సామాజిక, ఆర్థిక అంశాలపై అక్టోబర్ 8, 9, 10తేదీలలో సమావేశాలు**

# సిటిజన్ యూత్ పార్లమెంట్

- తెలంగాణ ఏర్పాటు, తొమ్మిదేండ్ల పాలనపై ప్రధానమైన చర్చ
- అక్టోబర్ 4 వరకు రిజిస్ట్రేషన్ చేసుకొనే అవకాశం

సిటీబ్యూరో, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): 'మీరూ భారత పార్లమెంట్ సభ్యులు కావొచ్చు.. పార్లమెంట్‌లో మీ వాగ్ధాటితో దేశం మొత్తాన్ని ఆకర్షించవచ్చు.. అందుకు సిటిజన్ యూత్ పార్లమెంట్' వేదికవుతున్నది. తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా 'సిటిజన్ యూత్ పార్లమెంట్' సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ సౌజన్యంతో సిటిజన్ ఇండియా సంస్థ నిర్వహిస్తున్న సిటిజన్ యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో పాల్గొన్న యువత పార్లమెంట్‌లో మాదిరిగానే ప్రజా సమస్యలపై దేశం మొత్తాన్ని ఆకర్షించే విధంగా చర్చించే అరుదైన అవకాశం కల్పించనున్నారు. ఇందులో దేశానికి సంబంధించిన అభివృద్ధి అంశాలు మొదలు సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా, వైద్యం, సంక్షేమం వంటి అన్ని రంగాలపై సుదీర్ఘంగా చర్చించే అవకాశం కల్పిస్తున్నారు. ఉస్మానియా యూనివర్సిటీలోని టాగోర్ ఆడిటోరియంలో నిర్వహించనున్న ఈ సమావేశంలో 18 నుంచి 40 సంవత్సరాలు ఉన్న స్త్రీ, పురుషులు ఎవరైనా పాల్గొనే అవకాశం ఉన్నదని సిటిజన్ ఇండియా సీఈవో స్వాతిచంద్రశేఖర్ తెలిపారు. యువతతో పాటు నిష్ణాతులు, ప్రొఫెసర్లు, రాజకీయ నాయకులు పాల్గొంటారని చెప్పారు.

### అక్టోబర్ 8 నుంచి మొదలు

అక్టోబర్ 8, 9, 10 తేదీలలో నిర్వహించనున్న యూత్ పార్లమెంట్ సమావేశాల్లో మూడు అంశాలపై ప్రధానంగా చర్చించనున్నారు. వాటిలో తెలంగాణ అంశాన్ని ప్రధానంగా ఎంపిక చేశారు. తెలంగాణ రాష్ట్రం రాక ముందు, వచ్చిన తర్వాత అభివృద్ధి ఎలా జరిగింది.? వ్యవసాయం ఎలా బాగుపడింది.? రైతుల కోసం అమలు పరుస్తున్న రైతుబంధు పథకం ఎలా అమలవుతుంది..? ఈ పథకం వల్ల రైతులకు కలుగుతున్న లాభాలు? వంటి అంశాలై ప్రత్యేకంగా చర్చించనున్నారు. అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా ఎలా నిలువగలిగింది అనేదానిపై చర్చించనున్నారు. యూత్ పార్లమెంట్‌లో రాష్ట్రంలోని ఓయూ, కాకతీయ, శాతవాహన, జేఎన్‌టీయూ తదితర యూనివర్సిటీల నుంచి అనేక మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

### వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీవేదికగా..

రాష్ట్రాల వారీగా నిర్వహించనున్న యూత్ పార్లమెంట్ వేదికల ద్వారా దేశ వ్యాప్తంగా మొత్తం 543 మందిని వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీవేదికగా నిర్వహించనున్న నేషనల్ లెవల్ యూత్ పార్లమెంట్‌లో పాల్గొనడానికి అవకాశం కల్పిస్తున్నారు. అంటే ప్రస్తుతం భారత పార్లమెంట్‌లో ఎంత మంది ఎంపీ సభ్యులు ఉన్నారో.. ఆ సంఖ్య ప్రకారమే ఇక్కడ అభ్యర్థులను ఎంపిక చేసే కార్యక్రమం కొనసాగుతున్నది. అందులో భాగంగా తెలంగాణ నుంచి 17మంది, ఏపీ నుంచి 25 మంది, ఈ విధంగా రాష్ట్రాల వారీగా యూత్ పార్లమెంట్ సభ్యులను ఎంపిక చేయనున్నారు. ఈ సమావేశాల్లో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న యువత, విద్యార్థులు అక్టోబర్ 4వ తేదీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కోసం http://forms.gle/3rshpgfR5fe4ACUa9 పోర్టల్‌ను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు. పూర్తి వివరాల కోసం 9319256888 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

# నేడు అందుబాటులోకి ఓఆర్ఆర్ సైకిల్ ట్రాక్

### ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : దేశంలోనే మొట్ట మొదటి సారిగా ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పర్యావరణ హితంగా నిర్మించిన సోలార్ రూఫ్ టాప్ సైకిల్ ట్రాక్‌ను అక్టోబర్ 1న (నేడు) ప్రారంభించనున్నారు. గ్రేటర్ చుట్టూ 158 కి.మీ మేర నిర్మించిన ఔటర్ రింగు రోడ్డు లోపలి వైపు సుమారు 23 కి.మీ దూరంతో ఎంతో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చేపట్టింది. నిర్మాణ పనులన్నీ పూర్తి కావడంతో ఆదివారం సాయంత్రం 6గంటలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, పుర





పాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు సోలార్ రూఫ్ టాప్ సైకిల్ ట్రాక్‌ను ప్రారంభించనున్నారు. ఐటీ కారిడార్‌లోని నానక్‌రాంగూడ నుంచి నార్సింగి, మంచిరేవుల మీదుగా తెలంగాణ పోలీస్ అకాడమీ వరకు, నార్సింగి నుంచి కోకాపేట, వట్టినాగులపల్లి మీదుగా కొల్లూరు వరకు మొత్తం 23 కి.మీ దూరం సోలార్ రూఫ్ టాప్ సైకిల్ ట్రాక్‌ను నిర్మించారు. ఈ సైకిల్ ట్రాక్‌పై సుమారు 16 మెగావాట్ల స్థాపిత సామర్థ్యంతో సోలార్ పవర్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసేలా దీన్ని డిజైన్ చేసి ఏర్పాటు చేశారు.

# పక్షి ప్రపంచం.. రండి వీక్షిద్దాం



బొటానికల్ గార్డెన్స్‌లో పక్షుల వీక్షణలో పాల్గొన్న ప్రతినిధులు

కొండాపూర్, సెప్టెంబర్ 30 : తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ, హైదరాబాద్ బర్డింగ్ పాల్స్ ఆధ్వర్యంలో శనివారం కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్స్‌లో పక్షుల వీక్షణ (బర్డ్ వాక్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీఎస్‌ఎఫ్‌డీసీ డైరెక్టర్ అక్బర్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జీ స్కైలాబ్‌లు ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఊపి పక్షుల వీక్షణను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు 30 మంది పక్షుల వీక్షకులు, 44 మంది సరోజిని నాయుడు వనితా మహావిద్యాలయం జంతు శాస్త్రం విద్యార్థినులు విచ్చేశారు. వీరిని ఎకో టూరిజం ప్రాజెక్ట్స్ మేనేజర్ సుమన్ 4 బృందాలుగా వేరు చేసి పక్షుల వీక్షణ ఎలా చేయాలి, వాటిని ఎలా గుర్తించాలి, ఎలాంటి పక్షులు ఎలాంటి శబ్ధాలు చేస్తాయనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌ఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్ నాయక్, ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మారెడ్డి, శాంసన్ రాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సూక్ష్మ ఆర్టిస్ట్ ప్రదీప్‌కు చోటు



సర్టిఫికెట్‌ను తన తల్లికి చూపుతున్న ప్రదీప్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ) :తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నగరంలోని అల్వాల్‌కు చెందిన సూక్ష్మ ఆర్టిస్ట్ పూన ప్రదీప్‌కుమార్‌కు చోటు దక్కింది. ఇప్పటి వరకు 100కు పైగా రావి ఆకులపై చిత్రాలను చిత్రించారు. ఇందులో పండుగలు, తెలంగాణ సంస్కృతికి సంబంధించిన చిత్రాలు అద్భుతంగా ఆకట్టుకునే విధంగా ఉన్నాయి. బతుకమ్మ, గణపతి, లక్ష్మీదేవి లాంటి ఆధ్యాత్మిక చిత్రాలను గీయడంతో పాటు జాతీయ నాయకుల చిత్రాలను సైతం తన సూక్ష్మకళతో భళా అనే విధంగా శిల్పాలవలె గీయడంతో ఆయన సూక్ష్మ చిత్రకళకు తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా శనివారం ప్రదీప్‌కుమార్‌కు సర్టిఫికెట్ ప్రదానం చేశారు.